# గౌరీదేవి పాట

శ్రీగౌరి నీపూజ చేయబూనితినమ్మ

కాపాడి మమ్మేలు కాశీపుర రాణీ

శాంకరీ పార్వతీ శంభునీ రాణీ

తల్లి నిన్నెపుడు ధ్యానింతునమ్మ

కలహంస నడకల కదలిరావమ్మ

సింహ పీఠంబున చెలియరో కూర్చుండ

బంగారు చెంబుతో గంగ నీళ్ళు దెచ్చి

కొంత నీ పాదాల కడిగి తడియొత్తెద

అంబికా నీకిదే ఆర్ఘ్యంబునిత్తును

ఆకాశగంగతో అర్పింతు తల్లి

పంచామృతంబిదే పణతిరో నీకిత్తు

సాంబ్రాణి ధూపంబు శంకరీ నీకిత్తు

దేవి నీసన్నిధి దీపంబు వెలిగింతు

సారపల్కుల పప్పు నారికేళములును

నాతిరో నీకిదే నైవేద్యమిచ్చెద

పార్వతీ నీకిదే పానీయమిచ్చెద

శంభురాణీ నీకు తాంబూలమిచ్చెద

దాక్ష్యాణీ నీకు దక్షిణల నిచ్చెద

మానినీ గైకొమ్మ తిరిగివచ్చీ నీకు

సాగిల మ్రొక్కితిని సావిత్రీ దేవి

అంగనామణి నీకు మంగళహారతి

భువనేశ్వరీ నిన్ను పూజింతునమ్మ

మమ్ము గాపాడుమా మాతల్లి గౌరమ్మ

తప్పులన్నీ గాచి తల్లితో మమ్మేలు

జయ జయము గౌరమ్మ జయమహో తల్లి